
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 24.0


పనులా.. పథకాలా..?

కొటిపి చెరువుకట్టపై పెరిగిన ముళ్లకంపలు


చెరువుల అభివృద్ధికి జీఎస్టీ అడ్డు

- రిజిస్ట్రేషన్ ఉంటేనే బిల్లులు
- జీఎస్టీ చేయించుకుంటే పథకాలు వర్తించవని అధ్యక్షుల వెనకడుగు
- నిధులు మంజూరైనా ప్రారంభంకాని పనులు

హిందూపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో చెరువుల అభివృద్ధికి రూపాయి కూడా నిధులు మంజూరు చేయలేదు. దీంతో చెరువుల్లో కంపచెట్లు పెరిగిపోయాయి. చెరువు కట్టలపై ముళ్ల పొదలు దర్శనమిస్తున్నాయి. మరువలు కుంగిపోయాయి. తూములు లీకవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక చెరువుల మరమ్మతులపై దృష్టి సారించింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో చిన్నాచితకా పనులు చేసేందుకు నిధులు మంజూరు చేసింది. ఆ పనులకు జీఎస్టీ కారణంగా ఎవరూ ముందుకు రావట్లేదు. చెరువు సంఘం అధ్యక్షులకు జీఎస్టీ ఉంటేనే పనులు అప్పగిస్తారు. జీఎస్టీ చేయించుకుంటే సంక్షేమ పథకాలు రద్దవుతాయని వారు ముందుకు రావట్లేదు. దీంతో చెరువు పనులు ప్రారంభం కాలేదు.

పనులకు బ్రేక్

జిల్లాలో మొదటి విడత కింద చెరువుల మరమ్మతుల కోసం రూ.2కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో రూ.60 వేలు మొదలుకుని రూ.4లక్షలదాకా ఒక్కో చెరువుకు మంజూరైంది. చెరువుకట్టపై ఉన్న ముళ్లకంపలు తొలగించడం, మరువలు, తూముల లీకేజీల మరమ్మతులు, చెరువుకట్ట ఎక్కడైనా లీకేజీ ఉంటే వాటికి సంబంధించిన పనులు వేగవంతంగా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రూ.10లక్షలలోపు పనులను నామినేషన్ పద్ధతిలో ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో చెరువు సంఘం అధ్యక్షులు ఎగిరిగంతేశారు. జీఎస్టీ ఉండాలని ప్రభుత్వం అనడంతో వారు ఉసూరుమన్నారు.

నిధులు మంజూరైనా..

జిల్లాలో 120 చెరువులకు సంబంధించిన పనులను ప్రారంభించాలని సూక్ష్మ జల వనరుల శాఖ (మైనర్ ఇరిగేషన్) అధికారులు.. చెరువు సంఘం అధ్యక్షులను బతిమిలాడుతున్నారు. అయినా ఏ ఒక్కరూ పనులు చేయడానికి ముందుకురావట్లేదు. ఓవైపు ప్రభుత్వం వెంటనే పనులు చేయాలని ఆదేశిస్తుండడం, మరోవైపు వర్షాకాలం ముంచుకొస్తుండడంతో అధికారులు డోలాయమానంలో పడ్డారు. ఈ విషయాన్ని కొంతమంది జలవనరుల శాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు.

జీఎస్టీ వద్దు

చెరువు సంఘం అధ్యక్షులుగా ఎన్నికైనవారు దాదాపుగా అందరూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన రైతులే. వారు జీఎస్టీ చేయించుకుంటే సంక్షేమ పథకాలు రద్దవుతాయి. కొంతమంది 2014-19 మధ్యలో ఉన్న చెరువు సంఘం అధ్యక్షులు మరోసారి ఎన్నికయ్యారు. వీరికి అప్పట్లో జీఎస్టీ ఉంది. అయినా వీరు అప్పట్లో చేసిన పనులకు బిల్లులు రాకపోవడం, ఆరేళ్లుగా నిరుపయోగంగా ఉండటంతో వాటిని రెన్యూవల్ చేసుకోవాలంటే రూ.లక్షదాకా జరిమానా కట్టాల్సి ఉంటుంది. దీంతో వారు కూడా రెన్యువల్ చేయించుకోవడానికి ముందుకు రావట్లేదు. ముఖ్యంగా జీఎస్టీ ఉంటే రేషన్‌కార్డు, తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాలు వర్తించవు. అలాంటపుడు పనులు లేకపోయినా పర్వాలేదనీ, ఉన్న సంక్షేమ పథకాలు ఎలా వదులుకోవాలని చెరువు సంఘం అధ్యక్షులు అంటున్నారు. దీనిపై మంత్రి సవిత చెరువు సంఘం అధ్యక్షులతో

(మిగతా 7లో...)

నాన్న రోటీల దుకాణం.. కూతురికి అమెజాన్‌లో కొలువు



తన్య

పుట్టపర్తిరూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): చిన్న దుకాణంలో రోటీలు తయారుచేసి విక్రయించే వ్యక్తి కుమార్తె ఏకంగా ఈకామర్స్ దిగ్గజం అమెజాన్‌లో కొలువు సాధించింది. పుట్టపర్తికి చెందిన అశుగుప్తా, ఆరుమిగుప్తా దంపతుల కుమార్తె తన్యగుప్తా రూ.10 లక్షల వార్షిక వేతనంతో కొలువు పొందింది. అశుగుప్తా పుట్టపర్తి బస్టాండులో చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుని, రోటీలు విక్రయిస్తుంటారు. ఆయన కుమార్తె తన్య స్థానిక సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఈఈఈ పూర్తిచేసింది. ఇటీవల నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్‌లో 10 లక్షల వార్షికవేతనంతో అమెజాన్‌లో ఉద్యోగం సాధించిం, కుటుంబంలో ఆనందం నింపింది. తన్యను కళాశాల యాజమాన్యం, పట్టణవాసులు అభినందిస్తున్నారు.

ప్రాచీన ఆలయాలను పరిరక్షించాలి

రాష్ట్ర అధ్యయన కేంద్రం కార్యదర్శి ఓలేటి సత్యనారాయణ


మాధవరాయ ఆలయ శాసనాన్ని పరిశీలిస్తున్న ప్రముఖులు

గోరంట్ల, జూన్29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రాచీన ఆలయాలను పరిరక్షించడానికి ప్రతిఒకరు ఉద్యమస్ఫూర్తితో ముందుకు రావాలని రాష్ట్ర అధ్యయన కేంద్రం కార్యదర్శి ఓలేటి సత్యనారాయణ, చరిత్రకారుడు మైనాస్వామి పిలుపునిచ్చారు. జిల్లాలో ధ్వంసమైన ఆలయాలను వారు ఆదివారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారతీయ వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన ప్రాచీన ఆలయాలను పరిరక్షిస్తూ, పునర్నిర్మించి, పూర్వవైభవం తీసుకురావడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ధ్వసమౌతున్న ఆలయాలను గురించి, వాటి పరిరక్షణకు కార్యచరణ రూపొందిస్తామన్నారు. మండలంలోని మల్లెల గుట్టపై ఉన్న పురాతన, మాధవరాయస్వామి ఆలయాలను వారు సందర్శించారు. ఆలయాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకులు శివగురుప్రసాద్, హరినాథ్‌రెడ్డి, దేవిస్వామి, వీరప్రసాద్ పాల్గొన్నారు.

నేత్రదానం


కళ్లను సేకరిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

కదిరి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పూల బజారుకు చెందిన సత్రాల సాయిరాం ప్రభాకర్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన తన కళ్లను రెడ్‌క్రాస్ సొసైటీకి దానం చేస్తూ.. అంగీకార పత్రం రాశారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ సొసైటీకి తెలిపి కళ్లను దానం చేశారు. తాను చనిపోయినా మరి కొంతమందికి ప్రపంచాన్ని చూసేలా ప్రభాకర్ చేశారని పలువురు కొనియాడారు.

ధర్మవరంలో..


కళ్లను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేస్తున్న కుటుంబ సభ్యులు

ధర్మవరం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దయ్యగుట్టకు చెందిన చక్కా వెంకటేశ్(62) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. విశ్వదీపా సేవా సంఘం సభ్యులు.. మృతుడి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుడి కుటుంబీకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే లెటర్ లేదా...?

- పక్కన ఉండండి
- కౌన్సెలింగ్‌లో డీడీ హల్‌చల్
- వెనుక ఉన్నోళ్లకు కోరుకున్న స్థానాలు
- సిఫార్సుల ముసుగులో అధికారుల బిజినెస్
- లబోదిబోమన్న సోషల్‌వెల్ఫేర్ అసిస్టెంట్లు


సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లపై రుబాబు చూపుతున్న డీడీ

అనంతపురం విద్య, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నీపేరు ఏమిటీ..? సార్ నాపేరు ఫలానా అనివెల్ఫేర్ అసిస్టెంట్ అనగానే.. చూడప్పా.. ఈయన పేరు మీద ఎమ్మెల్యే, ఇతర నేతల నుంచి ఏమైన లెటర్ ఉందేమో..? ఉందిసార్ అంటే.. ఓకే ఏ ప్లేస్ తీసుకుంటావో తీసుకో.. లేదుసార్ అంటే.. అయితే మీరడిగినప్లేస్ లేదు.. ఇదిగో ఇది ఉంది తీసుకొనిపో.. అంటూ సోషల్ వెల్ఫేర్‌శాఖ డీడీ బదిలీల కౌన్సెలింగ్‌లో హల్‌చల్ చేయడం తీవ్ర విమర్శలకు దారితీయడంతో పాటు పాలకులపైనా అసంతృప్తి కనిపించింది. సీనియార్టీ ప్రకారం అన్ని ఖాళీలు చూపించాల్సి ఉంది. ముందు వరుసలో ఉన్న వారు అడిగిన స్థానాలు ఇవ్వలేదు. వారు అనుకున్నవారికి సీనియార్టీ జాబితాలో వెనుక ఉన్నా కోరుకున్న స్థానాలు ఇచ్చారు.

ఉదాహరణకు కొన్ని..

సీరియల్ నెంబరు 14.. ర్యాంకు నెంబరు 1468..ఈమెకు కందుకూరు ఇచ్చారు. మరో ఆమెది సీరియల్ నెంబరు 57, ర్యాంకు నెంబరు 1291. ఈమెకు నరసనాయునికుంట కేటాయించారు. మరో మహిళది సీరియల్ నెంబరు 97, ర్యాంకు నెంబరు 1287. ఈమెకు కక్కలపల్లి ఇచ్చారు. మరో వ్యక్తిది సీరియల్ నెంబరు 86, ర్యాంకు నెంబరు 1214.. ఇటుకలపల్లి కేటాయించారు. అంతకు ముందు సీరియల్ నెంబరులో ఉన్నవారందరూ ఆప్లేస్‌లను చూపించి ఇవ్వాలని వేడుకున్నా డీడీ కనికరం చూపలేదు. ఈ తతంగం అంతా ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సచివాలయాల సోషల్‌వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియలో కొనసాగింది. డీడీ రామాంజనేయులు కౌన్సెలింగ్ హాలులో అందరి సమక్షంలోనే బహిరంగంగా వ్యవహరించిన తీరు చూసి సిబ్బంది అవాక్కయ్యారు. అన్ని నియోజక వర్గాల్లోనూ అనుకూలమైన స్థానాలకు ఇదే పరిస్థితి నెలకొంది.

కలెక్టర్ చెప్పినా మారని డీడీ తీరు

జిల్లా యంత్రాంగం ఆయా శాఖల పరిధిలో ఉన్న సచివాలయాల ఉద్యోగులకు బదిలీల ప్రక్రియ చేపట్టింది. సోషల్‌వెల్ఫేర్ అసిస్టెంట్లకు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ బదిలీలు నిర్వహిస్తోంది. శనివారం అంబేడ్కర్ భవన్‌లో కౌన్సెలింగ్ చేపట్టగా.. బదిలీల జాబితాలో ఉన్నవారు హాజరయ్యారు. సీనియార్టీ ప్రకారం అడిగిన స్థానాలు ఇవ్వకపోవడంతో వెల్ఫేర్ అసిస్టెంట్లు తిరుగుబాటు చేశారు. రాత్రి వరకు ఆందోళన కొనసాగడంతో ఆదివారానికి వాయిదావేశారు. చివరకు కలెక్టర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ నిర్వహించి సచివాలయాల ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. కానీ, సోషల్ వెల్ఫేర్ శాఖ డీడీ మాత్రం బదిలీల సమయంలో నిబంధనలను గాలికి వదిలేసి వ్యవహరించారు. దీంతో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆవేదన చెందుతూనే.. ఎదురుతిరిగితే ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బందులు వస్తాయోని భయపడి డీడీ చెప్పినమేరకు ప్లేస్‌లు తీసుకొని వెళ్లారు. ఇదేమి న్యాయమని అడిగిన

(మిగతా 7లో...)

సీట్ల కోసం సిఫార్సులు..!

- కేజీబీవీల్లో ప్రవేశానికి తీవ్ర పోటీ
- కుప్పలుతెప్పలుగా ప్రజాప్రతినిధుల లేఖలు
- తలలు పట్టుకుంటున్న ఎస్‌ఓలు
- సీట్లు పెంచాలని డిమాండ్


కేజీబీవీ

జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో సీట్లకు తీవ్ర పోటీ నెలకొంది. వీటిలో సీట్ల కోసం ఏకంగా మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో విద్యార్థినుల తల్లిదండ్రులు వస్తున్నారు. కుప్పలుతెప్పలుగా సిఫార్సులు వస్తుండడంతో కేజీబీవీల ప్రత్యేకాధికారు(ఎస్‌ఓ)లు తలలు పట్టుకుంటున్నారు. సీట్లన్నీ భర్తీ అయ్యాయని చెప్పి, వెనక్కి పంపుతున్నారు. చేసేదిలేక ఎస్‌ఓలు.. ప్రజాప్రతినిధులకే జాబితా పంపి, ఎంపిక చేయాలని కోరుతున్నారు.

- బుక్కపట్నం(ఆంధ్రజ్యోతి)

బాలికా విద్య కోసం కేజీబీవీలను ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులు లేని, వారిలో ఒకరు లేని, ఏ ఆసరాలేని పిల్లలకు ప్రవేశాల్లో ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. ఆ తరువాత నిరుపేద పిల్లలకు అవకాశం కల్పిస్తారు. జిల్లాలో 30 కేజీబీవీలు ఉన్నాయి. తరగతికి 40 మంది చొప్పున 280 సీట్లు ఉన్నాయి. కేజీబీవీల్లో బాలికలకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు ఉంటాయి. దీంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేదలు.. తమ పిల్లలను కేజీబీవీల్లో చేర్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తులు చేసుకున్న వారిలో సగం మందికి కూడా సీట్లు రావడంలేదు. దీంతో వందలాది మంది విద్యార్థినులు ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్నారు. వారి తల్లిదండ్రులు సీటు సంపాదించేందుకు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. సిఫార్సు లేఖల కోసం ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్తున్నారు. విద్య విషయం కావడంతో వారు లేఖలు ఇచ్చి పంపుతున్నారు. అలా.. సిఫార్సులు కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ఉన్న సీట్ల కంటే రెండు, మూడు రెట్లు అధికంగా సిఫార్సు లేఖలు వచ్చి పడుతున్నాయి. ఎవరికి సీటు ఇవ్వాలో అర్థంకాక ఎస్‌ఓలు తలలు పట్టుకుంటున్నారు. సిఫార్సు లేఖలతో వచ్చినా సీట్లు ఖాళీ లేవంటూ వెనక్కి తిప్పి పంపుతున్నారు. ఈ నేపథ్యంలో డిమాండ్‌కు తగ్గట్టుగా పాఠశాలలో సీట్లు పెంచాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సీట్లు సర్దేసుకుంటున్నారు..

కేజీబీవీల్లో సీట్లకు డిమాండ్ ఉండటంతో ఎస్‌ఓలు తమకు అనుకూలమైన వారికి ఇచ్చుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థినులు గైర్హాజరైతే వారి స్థానంలో కొత్తవారిని తీసుకుంటున్నారు. సీట్లు ఖాళీ అయిన విషయాన్ని తమకు అనుకూలమైన వారికి చెప్పి సంబంధిత ఎమ్మెల్యేలతో తమకు చెప్పించాలంటూ ఎస్‌ఓలు పురమాయించి గుట్టుగా పని చక్కబెట్టుకుంటున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలోని కేజీబీవీల్లో సీట్లకు డిమాండ్ ఉన్నమాట వాస్తవమే. సీట్లు పెంచాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

- దేవరాజ్, ఏపీడీ, సమగ్రశిక్ష

భార్యను తిట్టాడని హత్య..

- మద్యం మత్తులో గొడవ
- ఇద్దరు నిందితుల అరెస్ట్ : డీఎస్పీ

- వివరాలు 7లో..

పెళ్లైన ఏడు నెలలకే చంపేశారు..

- అదనపు కట్నం కోసమేనని మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు
- పరారీలో భర్త, కుటుంబ సభ్యులు

- వివరాలు 7లో...

కదిరికి చేరిన చిన్నారి

సీడబ్ల్యూసీ వద్ద హాజరు

పాప విక్రయంపై కొనసాగుతున్న విచారణ


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కదిరిఅర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కేరళలో విక్రయించిన చిన్నారిని పోలీసులు సురక్షితంగా కదిరికి తీసుకు వచ్చారు. కదిరి మండలానికి చెందిన దంపతులు కేరళలో డబ్బుల కోసం చిన్నారిని అమ్ముకున్న సంఘటన కలకలం రేపింది. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ ఘటనపై కదిరి అప్‌గ్రేడ్ పోలీసులు కేరళకు వెళ్లి చిన్నారిని సురక్షితంగా కదిరికి తీసుకొచ్చారు. ఆదివారం అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐ నిరంజన్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. వారు తెలిపిన మేరకు.. మండలంలోని మరవతండాకు చెందిన రవీంద్రనాయక్, శ్రీవాణి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె యశ్విత ఉన్నారు. వీరు 8నెలల క్రితం ఉపాధికోసం కేరళకు వెళ్లారు. ఇటీవల స్వగ్రామానికి చేరుకున్నారు. వీరితోపాటు చిన్నారి లేకపోవడంతో రవీంద్రనాయక్ చిన్నాన్న రామచంద్రనాయక్ పాప ఏదీ అని ప్రశ్నించారు. కేరళలో పాపను అమ్మేశారని ఆరోపిస్తూ.. ఇరుకుటుంబాల మధ్య ఘర్షణకు దారి తీసి, ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఇరు కుటుంబాలకు గాయాలు కావడంతో ఈ నెల 26న కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. పోలీసులు ఇరువురిపై కేసులు నమోదుచేశారు. విచారించగా పాపను అమ్మలేదని, పోషించలేకనే కేరళలో ఆర్టీసీ డ్రైవర్ రాజేష్, బ్యాంక్ ఉద్యోగి స్వాతి దంపతుల వద్ద ఉంచినట్లు చెప్పారు. తమకు పిల్లలు లేకపోవడంతో చిన్నారిని తమవద్ద ఉంచుకున్నట్లు వారు తెలిపారు. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు పోలీస్ బృందం కేరళకు వెళ్లి చిన్నారితోపాటు రాజేష్, స్వాతి దంపతులను కదిరికి తీసుకొచ్చారు. చిన్నారిని సోమవారం సీడబ్ల్యూసీ ముందు హాజరుపరచి, కమిటీ ఆదేశాల మేరకు అవసరమైన, న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. చిన్నారిని అమ్మేశారా, లేదా అన్నది దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ఇరువురి బ్యాంక్ ఖాతాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

అనంత ఆశలు..!

- వెనుకబడుతున్న 'అనంత' వైద్య కళాశాల
- 51 బోధన సిబ్బంది పోస్టులు ఖాళీ
- రెండు దశాబ్దాలుగా ఇదే తీరు
- నేడు డీఎంఈతో కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం
- అభివృద్ధికి చర్యలు తీసుకునేరా?



వైద్య కళాశాల

అనంతపురం వైద్యం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల అభివృద్ధి ఒక అడుగు ముందుకు, మూడు అడుగుల వెనక్కి అన్నచందంగా తయారైంది. దేశంలోని ఇతర వైద్య కళాశాలలు అభివృద్ధి బాటలో పయనిస్తుంటే.. అనంతలో మాత్రం ఎప్పుడూ వెనుకబడుతోందని వైద్యవర్గాలు వాపోతున్నాయి. 51మంది బోధన సిబ్బంది లేకపోవడమే ఇందుకు నిదర్శమనీ, రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని పేర్కొంటున్నాయి. జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ), రాష్ట్రంలోని డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) సంస్థలపై ఈ మెడికల్ కాలేజీ అభివృద్ధి ఆధారపడి ఉంది. వీటిని సద్వినియోగం చేసుకుంటే మెట్రో నగరాల్లోని కార్పొరేట్ స్థాయిలో అనంత మెడికల్ కాలేజీని అభివృద్ధి చేసుకోవచ్చని వైద్యవర్గాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా బీజేపీ ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ బాధ్యతలు వహిస్తున్నారు. ఆయన దృష్టి సారిస్తే అవసరమైన నిధులు, పోస్టులు తదితరాలు కేంద్రం

(మిగతా 7లో..)


తాడిమర్రి పోలీసు స్టేషన్ వద్ద ఉంచిన ట్రాక్టర్లు

ట్రాక్టర్ షోరూం కాదు...

తాడిమర్రి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వరుసగా ట్రాక్టర్లు. ఇదేదో ట్రాక్టర్ షోరూం అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఇది తాడమర్రి పోలీసు స్టేషన్ ఉంచున్న మైదానం. కడప జిల్లా పులివెందులకు చెందిన వ్యక్తి.. ట్రాక్టర్లను లీజుకు తీసుకుని, మోసగించాడు. ఆ కేసులో పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు ఇవి. మొదట్లో 57 ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకోగా.. 37 మంది యజమానులు డాక్యుమెంట్లు, ఆధారాలు చూపి తీసుకెళ్లారు. ఇంకా 20 ట్రాక్టర్లు మిగిలాయి. వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు చూపితే కోర్టు ద్వారా రిలీజ్ చేసుకునే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.

క్రైం కార్నర్

మంటల్లో కారు


కారులో మంటలు వస్తున్న దృశ్యం

నల్లమాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లి సమీపాన ఆదివారం వెళ్తున్న కారులో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. అందులోని నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలోని జిల్లా పరిషత్‌లో సీనియర్ ఆడిటర్‌గా పనిచేస్తున్న వెంకటశివారెడ్డి, ఆయన భార్య ఉరకొండ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న అనిత, వారి బంధువు పట్టు పరిశ్రమ శాఖ రిటైర్డ్ అధికారి కేశవరెడ్డి, అతడి భార్య వసుంధర రెడ్డివారిపల్లిలో బంధువుల పెద్దకర్మ కార్యక్రమానికి వచ్చారు. అనంతపురం తిరిగి వెళ్తుండగా రెడ్డిపల్లి, చారుపల్లి సమీపంలోని వంతెన వద్దకు రాగానే కారు నుంచి పొగలు వచ్చాయి. అప్రమత్తమైన కారులోని వారు కిందికి దిగేశారు. మంటలు చెలరేగి, కారు పూర్తిగా కాలిపోయింది. వెంటనే కదిరి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చి మంటలను అదుపు చేసింది. ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు.

పెళ్లైన ఏడు నెలలకే హత్య..

- అదనపు కట్నం కోసమేనని మృతురాలి బంధువుల ఫిర్యాదు
- పరారీలో భర్త, కుటుంబ సభ్యులు


శ్రావణి (ఫైల్)

బుక్కపట్నం, జూన్29(ఆంధ్రజ్యోతి): పెళ్లైన ఏడు నెలలకే మహిళను హత్య చేశారు. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన కమ్మరి శ్రావణి (22)ని భర్త నీలకంఠాచారి ఆదివారం తెల్లవారుజామున హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా పామిడికి చెందిన కమ్మరి రామాచారి కుమార్తె శ్రావణిని కృష్ణాపురం గ్రామానికి చెందిన గోవిందరాజు రెండో కుమారుడు నీలకంఠాచారికిచ్చి గతేడాది నవంబరు 21వ తేదీ వివాహం చేశారు. కట్నకానుకల కింద రూ.మూడు లక్షల నగదు, 15 తులాల బంగారం ఇచ్చారు. తరువాత నీలకంఠాచారి, మామ గోవిందరాజు, మరిది మాణిక్యం కలిసి వరికోత, విస్తరాకుల తయారీ మిషన్ల ఏర్పాటుకు డబ్బులు వెచ్చించారు. ఈ నేపథ్యంలో పుట్టినింటి డబ్బులు తీసుకురావాలని శ్రావణిని వేధించేవారు. కూమార్తె కష్టాలు చూడలేని రామాచారి మూడునెలల క్రితం రూ.లక్ష అల్లుడికి సర్దుబాటు చేశాడు. శనివారం సాయంత్రం శ్రావణి.. తండ్రికి ఫోన్ చేసి, 'మరింత అదనపు కట్నం కావాలని భర్త,మామ, మరిది వేధిస్తున్నారనీ, కొన్నిరోజులు పుట్టినింటికి వస్తానని చెప్పింది. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున నీలకంఠాచారి.. మామ రామాచారికి ఫోన్ చేసి శ్రావణి ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుందని చెప్పాడు. తర్వాత తండ్రి, కొడుకులు పరారయ్యారు. శ్రావణి తండ్రి, కుటుంబ సభ్యులు ఉదయాన్నే కృష్ణాపురానికి వచ్చారు. కుమార్తె మృతదేహాన్ని చూసి, బోరున విలపించారు. తన కుమార్తె మరణానికి భర్త, వారి కుటుంబ సభ్యులే కారణమని రామాచారి వాపోయాడు. హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ముగ్గురిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రావణి మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. వివాహమై ఏడునెలలే కావడంతో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ సురేష్, ఎస్ఐ కృష్ణమూర్తి, ఇన్‌చార్జి తహసీల్దార్ నరసింహులు హత్యాస్థలాన్ని పరిశీలించారు. పరారైన నిందితులకోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

పెళ్లి నాటి నుంచి తమ కుమార్తెను భర్త నీలకంఠాచారి, మామ గోవిందురాజులు, మరిది మాణిక్యం వేధిస్తున్నట్లు శ్రావణి తల్లిదండ్రులు రామాచారి, పుష్ప కన్నీరుమున్నీరుగా విలపించారు. బిడ్డ బాగుండాలని పలుమార్లు డబ్బులు ఇచ్చామనీ, అయినా శ్రావణిని హత్యచేశారని బోరున విలపించారు.

మణూరులో వృద్ధురాలు..


ముత్తక్క (ఫైల్)

మడకశిర రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మణూరు గ్రామంలో ముత్తక్క (78)ను హత్య చేశారు. సీఐ నాగేష్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముత్తక్కకు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూమార్తె రామలక్ష్మికి అశ్విని అనే కూతురు ఉంది. అమె భర్త చనిపోవడంతో రొద్దం గ్రామానికి చెందిన రహీమ్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. శనివారం ముత్తక్కను చూడడానకి అశ్విని, రహీమ్ మణూరుకు వెళ్లారు. ముత్తక్కతో గొడవపడ్డారు. ఆదివారం ఉదయం ముత్తక్క ఇంట్లో అచేతనంగా పడి ఉండడంతో స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు కనిపించడంలేదనీ, అశ్విని, రహీమ్ దాని కోసం హత్యచేసి ఉంటారని ముత్తక్క కుమారుడు నరసింహమూర్తి అనుమానం వ్యక్తం చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


ఏకపక్షంగా..

- ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలపై విమర్శలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలు ఏకపక్షంగా నిర్వహించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల్లో శనివారం గందరగోళానికి దారితీయడంతో తిరిగి ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మళ్లీ కొత్త సమస్యలు తలెత్తాయి. ర్యాంకుల వారిగా పూర్తి చేద్దామంటే.. మరో పక్క సిఫార్సు లేఖలు అడ్డొచ్చాయి. అన్ని అర్హతలు, సిఫార్సు లేఖలు ఉన్న కొందరికి కోరుకున్న స్థానాలు దక్కాయి. మరికొన్ని చోట్ల ప్రతిభ ఉన్నా సిఫార్సులకే మొగ్గు చూపారన్న చర్చ జరుగుతోంది. శనివారం స్పౌజ్ కేటగిరీలో ముగ్గురు అనర్హులుగా తేలడంతో రద్దు చేశారు. ఇందులో ఇతర జిల్లాలో పని చేసేవారు ఇక్కడ స్పౌజ్ వర్తించదని తిరస్కరించారు. కౌన్సెలింగ్‌లో ప్రతిభ కలిగిన వారిలో మంచి ర్యాంకు వచ్చిన వారు ఎక్కువ మంది సత్యసాయి జిల్లా నుంచి అనంతపురం పరిసర ప్రాంతాలకు మొగ్గు చూపడంతో సమస్య ఉత్పన్నమయింది. బదిలీల ప్రక్రియలో ఎస్ఈ జహీర్ అస్లాంతో పాటు ఈఈ ప్రభాకర్‌రెడ్డి, సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈ మురళీకృష్ణ పాల్గొన్నారు.

మనుషులంతా సోదరభావంతో మెలగాలి

- ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి


ఆయుధం లాంటి మనిషి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

అనంతపురం టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సమాజంలోని మనుషులంతా తోటివారిపట్ల సోదర భావంతో మెలగాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో కవి లోసారి సుధాకర్ రచించిన 'ఆయుధం లాంటి మనిషి' కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచపాళెం మాట్లాడుతూ... మనిషికి సామాజిక స్పృహతోపాటు కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా తోటివారితో ఆత్మీయత కలిగి ఉండాలన్నారు. ఇలాంటి భావాలకు ప్రతిబింబమే ఆయుధం లాంటి మనిషి పుస్తకం అని పేర్కొన్నారు. కవి సుధాకర్ మానవ బంధాలు, ప్రజా సమస్యలను తన కలంతో అక్షరరూపం ఇచ్చారన్నారు. ఇందులో స్త్రీల సమస్యలను సైతం వ్యక్తపరచడం కవి ఆలోచనా శైలికి అద్దం పడుతోందన్నారు. కార్యక్రమంలో కెంగార మోహన్, డాక్టర్ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

బదిలీల సందడి..!

- ఉద్యాన, పశుసంవర్ధక శాఖల్లో కౌన్సెలింగ్
- ప్రజాప్రతినిధుల సిఫార్సులకు పెద్దపీట


ఉద్యాన సహాయకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆ శాఖ డీడీ ఉమాదేవి, కమిటీ సభ్యులు

అనంతపురం అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా ఉద్యాన, పశుసంవర్ధక శాఖల్లో సిబ్బంది బదిలీల కౌన్సెలింగ్‌తో ఆయా కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. ఆదివారం ఉదయం 11.30 గంటలకు ఉద్యాన శాఖ డీడీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఉద్యాన సహాయకుల బదిలీల కౌన్సెలింగ్ మొదలై రాత్రి దాకా కొనసాగింది. ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లు పూర్తయిన 280 మంది ఉద్యాన సహాయకులతోపాటు రిక్వెస్ట్ కింద బదిలీ కోసం 43 మంది దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్ సీనియార్టీ మేరకు ఒక్కొక్కరిగా కౌన్సెలింగ్ హాల్‌లోకి సిబ్బందిని పిలిచి, ఆప్షన్లు రాసుకున్నారు. అనంత ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి, సత్యసాయి జిల్లా డీడీ చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఉద్యాన ఏడీ దేవానంద్, ఇతర కమిటీ సభ్యులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యాన శాఖ బదిలీల్లో ఎక్కువ శాతం ప్రజాప్రతినిధుల సిఫార్సులకే పెద్ద పీట వేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పశుసంవర్ధక శాఖలో కౌన్సెలింగ్ పూర్తి

అనంతపురం పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పశుసంవర్ధక సహాయకుల బదిలీల కౌన్సెలింగ్ ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 27 మంది ఐదేళ్లు పూర్తయిన సిబ్బందితో మూడు ఆప్షన్లు తీసుకున్నారు. రిక్వెస్ట్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న 99 మందికి మండలం ఆప్షన్ తీసుకున్నారు. కోరుకున్న మండలంలో ఏ స్థానానికైనా బదిలీ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. క్రమబద్ధీకరణలో స్థానాలు కోల్పోయిన మరో 37 మందికి ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు నిబంధనల మేరకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి పేర్కొన్నారు.

అనంత ఆశలు

(5వ పేజీ తరువాయి)

నుంచి సులువుగా రాబట్టవచ్చని వివరిస్తున్నాయి. విజయవాడలో సోమవారం డీఎంఈతో నిర్వహించనున్న సమావేశంలో అనంత మెడికల్ కాలేజీ అభివృద్ధి అంశాన్ని ప్రస్తావించే అవకాశాలున్నాయని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రధాన విభాగాలకు అధిపతుల్లేరు..

ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రధాన విభాగాలకు అధిపతులు లేకపోవడం విస్మయం కలిగిస్తోంది. సైక్రియాట్రీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, రేడియోడయాగ్నోసిస్, డెంటిస్ట్రీ, కార్డియాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, కార్డియాలజీ క్యాథ్‌ల్యాబ్ అండ్ సీటీవీఎస్, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ విభాగాలకు హెచ్‌ఓడీలు లేకపోవడం ఏంటని వైద్యవిద్యవర్గాలు విమర్శిస్తున్నాయి. ఫోరెన్సిక్, రేడియో డయాగ్నోసిస్ విభాగాలకు ఇద్దరు చొప్పున. డెంటిస్ట్రీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, ఎండోక్రొనాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ విభాగాలకు ఒకరు చొప్పున అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

27 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు..

ప్రొఫెసర్లకు, అసోసియేట్ ప్రొఫెసర్లకు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కుడి, ఎడమ భుజంలాంటివారు. అలాంటి ప్రాముఖ్యతగల పోస్టులు 27 ఖాళీగా ఉన్నాయి. అనాటమీలో నలుగురు, ఫిజియాలజీలో ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరు. రేడియోడయాగ్నోసిస్, ఎండోక్రొనాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ, కార్డియాక్ ఐసీసీయూ విభాగాల్లో ఇద్దరు చొప్పున కొరత ఉన్నారు. బయోకెమిస్ట్రీ, మైక్రోబయోలజీ, జనరల్ సర్జరీ, అనస్థీసియాలజీ, డెంటిస్ట్రీ, పీడియాట్రిక్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, కార్డియాలజీ, సర్జికల్ ఆంకాలజీ విభాగాల్లో ఒకటి చొప్పున మొత్తం 27 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోసులు ఖాళీగా ఉన్నాయి. మెడికల్ కళాశాలలోని విభాగాల్లో టీచింగ్ ఫ్యాకల్టీ ఖాళీలున్నంత వరకు వైద్యసేవల అభివృద్ధిలో వెనుకబాటులో ఉన్నట్లేనని వైద్యవిద్యరంగ నిపుణులు పేర్కొంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

- ప్రొఫెసర్ షారోన్ సోనియా, వైద్య కళాశాల ప్రిన్సిపాల్



కళాశాల అభివృద్ధికి ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తా. కళాశాలకు ముఖ్యమైన టీచింగ్ ఫ్యాకల్టీ తగిన సంఖ్యలో లేరు. ఎన్ఎంసీ నిబంధనల మేరకు అవసరమైన ఫ్యాకల్టీని నియమించాలని ఇప్పటికే డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాం. మిగిలిన విభాగాల్లో వసతుల అభివృద్ధిపైనా వివరాలు పంపాం. కళాశాల అభివృద్ధికి అవసరమైన అంశాలను ఉన్నతాధికారులకు వివరించేందుకు కృషిచేస్తా.

అయినవారికి ఆకుల్లో..

- బదిలీల్లో డీపీఓ సిబ్బంది ఇష్టారాజ్యం..
- ప్రతిభావంతులకు అన్యాయం

అనంతపురం న్యూటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలకు సంబంధించి గ్రేడ్-5 కార్యదర్శులు, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ల బదిలీల్లో అయినవారికి ఆకుల్లో.. లేదంటే జిల్లా సరిహద్దుల్లో అన్న విధంగా చేశారన్న ప్రచారం జరుగుతోంది. ఆదివారం కౌన్సెలింగ్ ప్రారంభించే లోపే సిఫార్సులకు, అయిన వారికి సంబంధించి కోరుకున్న ప్లేస్‌లను బ్లాక్ చేసి ర్యాంకుల వారీగా పిలిచారు. ప్రతిభ ఉన్న ర్యాంకర్లకు మొండిచేయి చూపారన్న విమర్శలు వినిపించాయి. డీపీఓ సిబ్బంది నిర్వహించిన బదిలీల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతిభ ఉన్నవారికి మొండిచేయి తప్పలేదన్న చర్చ జరిగింది. ఆర్డర్ ఫారాలు చేతికి వస్తే తప్ప.. అక్కడ జరిగిన లోపాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేదు. ఆర్డర్ ఫామ్స్ చేతికి వచ్చే సరికి ఒక్కొక్కటిగా సిబ్బంది తప్పిదాలు బయట పడే అవకాశం ఉంది. ఈ బదిలీల ప్రక్రియలో డీఎల్‌పీఓలు విజయ్‌కుమార్, శివకుమారి, ఏఓలు పాల్గొన్నారు.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించాలి

- సచివాలయ సర్వేయర్ల డిమాండ్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సర్వే శాఖ పరిధిలోని సచివాలయ సర్వేయర్ల బదిలీ కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. నిబంధనల మేరకు ర్యాంకుల వారిగా కేటాయించాలంటూ సర్వేయర్లు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో ఉదయం 9గంటలకు అధికారులు కౌన్సెలింగ్ ఆరంభించారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో ఐదేళ్ళ పూర్తయిన వారు 665, స్పౌజ్ ఇతర కారణాలతో 450మంది మొత్తం 1115మందికి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. కౌన్సెలింగ్ సమయంలో అధికారులు నిర్వహించే తీరుపై ఉద్యోగులు విముఖత వ్యక్తం చేశారు. ర్యాంకుల ప్రకారం ఇవ్వకుండా ఎలా కౌన్సెలింగ్ నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఏయే ఖాళీలు ఉన్నాయి..?ఎవరెవరు ఖాళీ చేశారు..?ఆ స్థానంలో ఎవరిని నియమిస్తున్నారనే విషయంలో స్పష్టత చూపడం లేదన్నారు. దీంతో కౌన్సెలింగ్ ఆలస్యమైంది. ఈ విషయం ఉద్యోగుల యూనియన్ నాయకులు అరుణ్, రవికుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఉన్నతాధికారులను కలి శారు. అనంతరం రాత్రి 10గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

నేడు జాబ్‌మేళా

ఉరవకొండ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మా డిగ్రీ కళాశాలలో సోమవారం స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బసవరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 10కి పైగా మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటాయని అన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకూ చదువుకున్న వారు పాల్గొనవచ్చునని తెలిపారు.

నేటి నుంచి ఏఎన్ఎంల బదిలీలు

అనంతపురం వైద్యం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు సోమవారం నుంచి బదిలీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 803 మంది ఏఎన్ఎంలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్నారు. వీరిలో 740 మంది ఐదేళ్లు పూర్తయిన వారున్నారు. డిస్ట్రిక్ట్ సెలెక్షన్(డీఎస్సీ)లో వచ్చిన ర్యాంకు ఆధారంగా మెరిట్ తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. స్పౌజ్, పీహెచ్‌సీ వెసులుబాటు కల్పించామన్నారు. జూమ్ మీటింగ్ ద్వారా ఎక్కడికక్కడే విధుల్లో నుంచే ఏఎన్ఎంలు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబీ దేవి ఆధ్వర్యంలో ప్రక్రియ చేపట్టనున్నారు.

వెల్లువలా దరఖాస్తులు

అనంతపురం వైద్యం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఆశా కార్యకర్తల ఖాళీల భర్తీకి దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లాలోని మొత్తం 58 పోస్టులకు సోమవారంతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందని అధికారులు తెలిపారు. ఖాళీస్థానాల పరిధిలోని ఆరోగ్య కేంద్రాల్లో అధికారులు, సచివాలయాల్లో అయితే ఏఎన్ఎంలు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

యాడికి, జూన్29(ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల బాలికపై 55 ఏళ్ల వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఆడుకుంటున్న బాలికపై 55 ఏళ్ల వ్యక్తి అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. గమనించిన స్థానికులు అతడిని మందలించారు. బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది. బాలిక తండ్రి సదరు వ్యక్తిని మందలించడంతో ఆ వ్యక్తి బంధువులు బాలిక తల్లిదండ్రులపైన దాడికి యత్నించారు. బాలికతో కలిపి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. అత్యాచారయత్నానికి ఒడిగట్టిన వ్యక్తి గతంలో కూడా ఓ బాలికపై అఘాయిత్యానికి పాల్పడినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

భార్యను తిట్టాడని హత్య

- మద్యం మత్తులో గొడవ పడి దారుణం
- ఇద్దరు నిందితుల అరెస్ట్: డీఎస్పీ

అనంతపురం క్రైం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): భార్యను కామెంట్ చేశాడని, బూతులు తిట్టాడని ఆమె భర్త మరో వ్యక్తికి ఏకంగా హత్య చేశాడు. మద్యం మత్తులో నాలుక జారినందుకు ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. అనంతపురం నగరంలోని బళ్లారి బైపాస్ సర్కిల్‌లో జరిగిన ఈ హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అనంతపురం అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జగదీష్, ఎస్ఐలు ప్రసాద్, విజయప్రసాద్‌తో కలసి ఆదివారం 4వ పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన గూడూరు సిదానంద ఈ నెల 23న రాత్రి హత్యకు గురయ్యాడు. చిన్న కిరాణా దుకాణంలో పనిచేసే ఇతడు బళ్లారి బైపాస్ సర్కిల్‌లో నేషనల్ హైవే వంతెన


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కింద అన్న క్యాంటీన్ వద్ద ఉన్న పార్కులో నిద్రిస్తుండగా దుండగులు ఫుట్‌పాత్‌కు వేసే సిమెంట్ ఇటుకతో తలపై మోది హత్య చేశారు. దీనిపై 4వ పట్టణ సీఐ జగదీష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. సంఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ప్రత్యేక టీంను వేశారు. స్థానికంగా లభించిన సీసీ ఫుటేజ్‌తోపాటు క్లూస్ టీమ్స్ సహాయంతో ముమ్మరంగా గాలించారు. ఎట్టకేలకు ఆదివారం నిందితులను అదుపులోకి తీసుకుని విచారించడంతో హత్య వెనుక అసలు విషయం బయటపెట్టారు.

మద్యం మత్తులో గొడవతో మొదలు..

నగరంలోని ఐదో రోడ్డులో నివాసం ఉంటున్న లక్ష్మన్న(25), విద్యారణ్యనగర్‌కు చెందిన తుమ్మశెట్టి వెంకటరెడ్డి(30)కు నెల కిందట పరిచయమైంది. ఇద్దరూ బొప్పాయి, దోసకాయ పండ్ల లోడింగ్ పనులకు వెళుతుంటారు. ఇద్దరూ మద్యానికి బానిసలే. 23న రాత్రి బళ్లారి బైపాస్‌లో మద్యం తాగుతుండగా యాధృచ్ఛికంగా సిదానందతో చిన్నపాటి గొడవ జరిగింది. మాటా మాటా పెరిగి తిట్టుకున్నారు. మద్యంమత్తులో సిదానంద లక్ష్మన్న భార్యను బూతులు తిట్టాడు. దీంతో ఆయన కోపోద్రిక్తుడయ్యాడు. తన ఫ్రెండ్ వెంకటరెడ్డితో మాట్లాడి ఎలాగైనా చంపాలనుకున్నాడు. సిదానంద కోసం వెతికాడు. మద్యం తాగిన తర్వాత క్యాంటీన్ పక్కన పార్కులో నిద్రిస్తున్నట్టుగా గుర్తించారు. విచక్షణ మరిచి ఫుట్‌పాత్ సిమెంట్ ఇటుక తీసుకొని ఇద్దరూ ఐదుసార్లు కొట్టి చంపేశారు. అక్కడి నుంచి రైల్వేస్టేషన్‌కు చేరుకుని తిరుపతికి పారిపోయారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులు లక్ష్మన్న, వెంకటరెడ్డిని ఆదివారం ఉదయం నడిమివంక వద్ద అరెస్టుచేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

పనులా.. పథకాలా..?

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జీఎస్‌టీ లేకుండా పనులు అప్పగించేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

జీఎస్‌టీ చేయించుకుంటే పథకాలు పోతాయంట

- శంకరప్ప, చెరువు సంఘం అధ్యక్షుడు, బూచర్ల, రొద్దం మండలం



చెరువు పనులు చేయాలని అధికారులు చెబుతున్నారు. జీఎస్‌టీ ఉంటేనే మా ఖాతాకు నిధులు వస్తాయి. లేదంటే డబ్బులు రావంటున్నారు. జీఎస్‌టీ చేయించుకుంటే సంక్షేమ పథకాలు రావు. ప్రభుత్వం మరోసారి ఆలోచించి జీఎస్‌టీ లేకుండా పనులు అప్పగించాలి.

నిధులు వెనక్కిపోయే ప్రమాదం

లక్ష్మయ్య, చెరువు సంఘం అధ్యక్షుడు, పూలకుంట, హిందూపురం మండలం



చెరువుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జీఎస్‌టీ మెలికపెట్టడంవల్ల పనులు చేసినా మాపేరు మీద డబ్బులురావు. జీఎస్‌టీ తప్పనిసరి చేశారు. జీఎస్‌టీ లేకపోతే పనులు త్వరితగతిన పూర్తి చేయవచ్చు. పనులు చేయకపోతే నిధులు వెనక్కిపోయే అవకాశం ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

- గురుమూర్తి, ఈఈ, మైనర్ ఇరిగేషన్, పెనుకొండ

జిల్లాల్లో 120చెరువుల మరమ్మతులకు రూ.2 కోట్లకుపైగా నిధులు మంజూరయ్యాయి. చెరువు సంఘం అధ్యక్షులకు జీఎస్‌టీ లేదు. జీఎస్‌టీ ఉంటేనే వారిపేరుమీద పనులు చేస్తే డబ్బులు జమవుతాయి. ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని తెలియజేశాం. గ్రామ పంచాయతీల తరహాలో రూ.10లక్షల లోపు పనులకు జీఎస్‌టీ లేకుండా నామినేషన్ పద్ధతిలో అప్పగిస్తే బాగుంటుంది.

ఎమ్మెల్యే లెటర్ లేదా...?

(5వ పేజీ తరువాయి...)

వారిపై వేదికమీద ఉన్న డీడీ రుబాబు ప్రదర్శించడం చూసి అందరూ అవాక్కయ్యారు.

సిఫార్సుల ముసుగులో అధికారుల బిజినెస్..?

ఇలాంటి సమయంలో అధికారపార్టీ నేతలు సిఫార్సు లేఖలు ఇవ్వడం సహజం. సీనియార్టీ జాబితాలో ముందు వరుసలో ఉన్న వారికి అన్యాయం జరగకుండా నేతల లేఖలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ డీడీ ఉమ్మడి జిల్లాలో 600 మందికి పైగా వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీలు ఉంటే.. దాదాపు 60 శాతం మందికి సిఫార్సుల పేరుతో అర్హులకు అన్యాయం చేయడం ఆశ్చర్యం కలిగించింది. మరోవైపు సిఫార్సుల ముసుగులో సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారులు, సిబ్బంది సైతం బిజినెస్ నడిపి జేబులు నింపుకున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. కొందరు కార్యాలయ సిబ్బంది వెల్ఫేర్ అసిసెంట్లతో కుమ్మక్కై రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ఒప్పందం చేసుకొని కట్టబెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం: యూటీఎఫ్

అనంతపురం విద్య, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులను కాపాడుకోవడం ఉపాధ్యాయులుగా మన బాధ్యత అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య పిలుపునిచ్చారు. ఆదివారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన విద్యా సంవత్సరం మొదలైందని, పిల్లందరినీ బడిలో చేర్పించుకొని ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందామన్నారు. సమస్యలపై పోరాటాలు సాగిస్తూనే.. విద్యార్థులకు విద్య నేర్పించడంలో ప్రతి టీచర్ చిత్తశుద్ధి ప్రదర్శించాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు రమణయ్య, అబ్దుల్‌ఖాన్, శేఖర్, రాముడు, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, దేవేంద్రమ్మ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

పారదర్శకంగా జరిగేనా..?

- మహిళా పోలీసుల బదిలీల ప్రక్రియ ప్రారంభం
- సీనియారిటీ లిస్ట్.. ఖాళీల జాబితాపై సందిగ్ధం
- ప్రిఫరెన్షియల్, స్పౌజ్ సర్టిఫికెట్ల పరిశీలన
- నేడు కౌన్సెలింగ్


సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం క్రైం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసులకు నిర్వహించనున్న బదిలీల ప్రక్రియ పాదర్శకతపై సందేహాలు కలుగుతున్నాయి. బదిలీల కౌన్సెలింగ్‌కు ముందుగానే ఉద్యోగుల సీనియారిటీ జాబితా ప్రకటించాల్సి ఉంది. అదేవిధంగా కంపల్సరీ, రిక్వెస్టు బదిలీల ఖాళీలు చూపించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ ఎలాంటి లిస్టు ప్రదర్శించలేదు. దీంతో వందలాది మంది మహిళా పోలీసుల్లో ఆందోళన నెలకొంది. సీనియారిటీ, ఖాళీల జాబితాలు బయటకు ఇవ్వకపోవడంతో ఆయా వర్గాల్లో హైటెన్షన్ నెలకొంది. పోలీస్ వర్గాల సమాచారం మేరకు... అనంతపురం, సత్యసాయి జిల్లాల పరిధిలో గ్రామ, వార్డు సచివాలయాలకు 1207 మహిళా పోలీస్ పోస్టులు మంజూరు చేశారు. వాటిలో 1064 పోస్టుల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల బదిలీలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో మహిళా పోలీసుల బదిలీల ప్రక్రియ మొదలైంది. ఇప్పటికే మహిళా పోలీసులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదుచేశారు. ఒకే సచివాలయంలో ఐదు సంవత్సరాలు పూర్తిచేసుకున్న వాళ్ల తప్పనిసరిగా, ఐదేళ్లు పూర్తి కాని వారు రిక్వెస్టు బదిలీ కింద హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియ తర్వాత ఖాళీల వివరాలు, సీనియారిటీ జాబితాలు ప్రదర్శించాలి. జిల్లా పోలీసు అధికారులు ఆదివారం సాయంత్రం వరకూ ఆ లిస్టులను బహిర్గతం చేయలేదు. పీహెచ్, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతర ప్రిఫరెన్షియల్ కేటగిరీ ఉద్యోగులతోపాటు, స్పౌజ్ పెట్టుకున్న ఉద్యోగులను పిలిపించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు ఆదివారం ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు, స్పౌజ్, నో డ్యూ సర్టిఫికెట్లు పరిశీలించారు. వీరికి సోమవారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

భారీగా పైరవీ లెటర్లు...?

ఉద్యోగుల బదిలీల నేపథ్యంలో పలువురు మహిళా పోలీసులు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు ఇచ్చినట్టు సమాచారం. తమకు ఫలానా స్థానాలు కావాలంటూ.. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లెటర్లు ఇచ్చినట్టు తెలుస్తోంది. బదిలీల్లో పోలీస్ ఉన్నతాధికారులు సిఫార్సులకు పెద్దపీట వేస్తారా..? లేక పారదర్శకంగా చేస్తారా చూడాలి.

న్యూస్ బాక్స్

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

పుట్టపర్తి రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బెంగళూరుకు చెందిన ప్రియ పెట్టేం అవిఘ్న అభ్యాస ఇనిస్టిట్యూట్ డాన్స్ ఫైన్ఆర్ట్ అకాడమీ వారి నృత్య ప్రదర్శన సాగింది. నృత్య కళాకారులు హరిప్రియ, హేమవర్షిణి కన్నన్, సుప్రజ, నిహారిక ఆనూష, సాయిభార్గవి, హితశ్రీ, హిమశ్రీ నృత్య ప్రదర్శనలు అహూతులను అలరించాయి.

సాయిభక్తుల భిక్షాటన

నల్లచెరువు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక సాయిబాబా ఆలయం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం మండలకేంద్రంలో భిక్షాటన చేశారు. ట్రాక్టర్‌పై బాబా చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, భజన బృందం సభ్యులు భక్తిపాటలు ఆలపిస్తూ భిక్షాటన చేశారు. నల్లచెరువులో సాయిబాబా దేవాలయం నిర్మించిన ప్పటినుంచి ప్రతి గురుపౌర్ణమికి భిక్షాటన చేస్తున్నట్లు కమిటీ సభ్యులు పందుచూరి నగేష్‌శెట్టి, రవిశెట్టి, లక్ష్మీపతి, మహేష్, రమణారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు తెలిపారు.

ఆశా కార్యకర్త పోస్టులకు
దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరగంపల్లి, ఇండ్లవెంకటంపల్లి గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఆశాకార్యకర్తల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని బుక్కపట్నం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సురేశ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 4వ తేదీ లోగా ఆయా గ్రామ సచివాలయాల్లో కానీ, బుక్కపట్నం పీహెచ్‌సీలో గానీ దరఖాస్తులు అందజేయవచ్చని ఆయన సూచించారు.

● నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక కేంద్రం పరిధిలో ఖాళీగా ఉన్న రెండు ఆశాకార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్యాధికారి దీప్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నేరాలవంకతండా, ఎర్రవంకపల్లి గ్రామాల్లో ఖాళీగా ఉన్నాయని, జూలై 4లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్థిక సాయం

కదిరి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలోని ఉబ్బరవాండ్లపల్లికి చెందిన వెంకటనారాయణ అనే వ్యక్తి కొన్నేళ్లుగా పక్షపాతంతో బాధపడుతున్నారు. ఉబ్బరవాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన ఆయన తోటి విద్యార్థులు ఆర్థికసాయం అందించారు. పూర్వ విద్యార్థులు బ్రహ్మానందరెడ్డి, చింతకాయల రెడ్డిశేఖర్ నాయుడు, క్రిష్ణమోహన్‌నాయుడు, కేవీ రమణ, భారతి ఆదివారం వెంకటనారాయణను పరామర్శించి, రూ. 22వేలు ఆర్థికసాయం అందజేశారు.

చక్కెర ఇస్తానని మోసం

● పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

కొత్తచెరువు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువుకు చెందిన దాల్‌మిల్ సూరి తనకు చక్కెర ఇస్తానంటూ మోసం చేశాడని విశాఖపట్నం జిల్లా గాజువాకకు చెందిన నత్తా పాపారావు కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ మారుతిశంకర్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జనవరి 2వ తేదీన దాల్‌మిల్ సూరి 30 టన్నుల చక్కెరకు రూ.10.46 లక్షలు తీసుకున్నాడని అన్నారు. ఇప్పటి వరకు చక్కెర సరఫరా చేయలేదని బాధితుడి ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేశామని అన్నారు. కంబదూరు మండలం రవికుమార్ నుంచి 34 క్వింటాళ్ల వేరుశనగ, 12వేల క్వింటాళ్లు మొక్కజొన్నను దాల్‌మిల్ సూరి అనే వ్యక్తి తీసుకుని తనకు రూ.30లక్షలు ఇవ్వలేదంటూ రవికుమార్ ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు. ఆ మేరకు చీటింగ్ కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

సంపులో పడి బాలుడి మృతి



వెంకట కనిష్క్ మృతదేహం

ధర్మవరం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతానగర్‌లో ఓ బాలుడు ఆదివారం నీటి సంపులో పడి మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు....గీతానగర్‌కు చెందిన అజయ్, లక్ష్మీ దంపతుల కుమారుడు వెంకటకనిష్క్(3) ఇంటి వద్ద ఆడుకుంటుండేవాడు. తల్లి ఇంట్లో పనులు చేసుకుంటుండగా.. బాలుడు ఆడుకుంటూ ఇంటి ఆవరణంలో ఉన్న నీటి సంపులో ప్రమాదవశాత్తు పడి మునిగిపోయి మృతిచెందాడు. గమనించి తల్లిదండ్రులు బాలుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. అక్కడున్న పలువురిని కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బాలుడి తండ్రి అజయ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

ఎస్సీ, ఎస్టీ కేసు

కొత్తచెరువు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ట్రైబల్ రాష్ట్ర అధ్యక్షుడు, హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ కౌన్సిల్ సభ్యుడు హరిలాల్‌నాయక్ ఫిర్యాదు మేరకు మలసాని వెంకటేశ్ అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు సీఐ మారుతీశంకర్ ఆదివారం తెలిపారు. మండలకేంద్రమైన కొత్తచెరువులోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద శనివారం ఎక్స్‌కవేటర్‌తో చెట్లను కూల్చివేస్తున్నారు. విషయం తెలుసుకున్నపెనుకొండ మండలం మంగాపురానికి చెందిన హరిలాల్‌నాయక్ అక్కడికి వెళ్లి అడ్డుకున్నాడు. ఈ సందర్భంగా కొత్తచెరువుకు చెందిన మలసాని వెంకటేశ్‌కు, హరిలాల్‌నాయక్‌కు ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో మలసాని వెంకటేశ్ తనను దూర్భాషలాడి దాడి చేసి, గాయపరిచాడని హరిలాల్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు డీఎస్పీ విజయ్‌కుమార్ విచారణ చేపట్టి మలసాని వెంకటేశ్‌పై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేసినట్టు సీఐ మారుతీశంకర్ తెలిపారు. అదేవిధంగా హరిలాల్‌నాయక్ తనను డబ్బులు డిమాండ్ చేశారని మలసాని వెంకటేశ్ ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు. మలసాని వెంకటేశ్ ఫిర్యాదు మేరకు హరిలాల్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

గొడవలకు దూరంగా ఉండండి: సీఐ

ముదిగుబ్బ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గొడవలకు దూరంగా ఉండాలని ముదిగుబ్బ సీఐ శివరాముడు సూచించారు. ఎస్పీ వి. రత్న ఆదేశాల మేరకు ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగులగుబ్బల గ్రామంలో సీఐ శివరాముడు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అక్రమ మద్యం విక్రయించే వారి నివాసాలతో పాటు అనుమానిత వ్యక్తుల ఇళ్లను తనిఖీ చేశారు. అలాగే రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన గొడవలు, అల్లర్లు, రోడ్డు భద్రత, బాల్యవివాహాలు, సైబర్‌క్రైమ్, శక్తి యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు.

సంక్షేమ వసతి గృహాలకు కొత్త కళ

● రూ. కోట్లతో భవనాల ఆధునికీకరణ ● మౌలిక వసతుల ఏర్పాటు



కదిరిలోని సంక్షేమ బాలుర వసతి గృహానికి నిర్మించిన ప్రహరీ

కదిరి అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమవసతి గృహాలు కునారిల్లాయి. కనీస వసతులు కూడా లేక పోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నికలకు యేడాదిన్నర మునుపు వసతి గృహాలను సమూలంగా మార్చేస్తామంటూ ఆ పాలకులు హడావిడి చేశారు. నాడు - నేడు పథకం అమలుచేస్తామని కాగితాలపై రూ. వేలకోట్లు చూపించారు. అయితే ఒక్కటంటే ఒక్క పని కూడా చేపట్ట లేదు. ఇరుకు గదులు, వసతులు లేని మరుగుదొడ్లు, ఆరుబయట స్నానాలు, కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలతో విద్యార్థులు, సిబ్బంది అలాగే సాగించారు. అటువంటి వసతి గృహాలను గాడిన పెట్టేందుకు ఏడాది క్రితం ఏర్పడిన ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాల్లో సౌకర్యాల కల్పన, మరమ్మత్తులపై దృష్టి సారించింది.

ఇప్పుడు అన్ని సౌకర్యాలతో...

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వసతిగృహం విద్యార్థులకు మంచి భోజనం, మెరుగైన సౌకర్యాలు కల్పించింది. రూ.కోట్లు వెచ్చించి భవనాల మరమ్మతులు చేయించడంతో పాటు కిటికీలకు దోమల మెస్, లైటింగ్, ఫ్యాన్లు ఏర్పాటు చేసింది. ప్రహరీల నిర్మాణం చేపట్టింది.

సీఎంగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన ఆర్నెల్లలోనే వసతి గృహాల్లోని సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టారు. దీంతో ప్రస్తుతం వసతి గృహాలన్నీ కళకళలాడుతూ, ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పన, ఆధునీకరణ పనులకోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరుచేసింది. ఇందులో భాగంగా జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో గల 23 వసతి గృహాలకు రూ.5.86 కోట్లు కేటాయించి, మరమ్మతులు చేపట్టింది.

సన్నబియ్యంతో భోజనం

ప్రభుత్వ పాఠశాలలు మధ్యాహ్న భోజన పథకానికి ఈ యేడాది నుంచి సన్నబియ్యం వినియోగిస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ వసతి గృహాల్లో సన్నబియ్యం అమలు చేస్తున్నారు. ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు, పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో ఇంటర్ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారు. ఫార్మసీ, పాలిటెక్నిక్, డిగ్రీ, జూనియర్ కళాశాలలతో పాటు ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులంతా ప్రభుత్వ వసతి గృహాల్లో చేరాలని అధికారులు, వార్డెన్లు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే ప్రభుత్వం నిధులు కేటాయించి హాస్టల్ విద్యార్థులకు క్రీడాపరికాలు పంపిణీ చేసి, క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తోంది. వీటితోపాటు అన్ని వసతి గృహాలకు దాదాపు రూ.40వేల విలువగల వంటసామాగ్రిని అందించింది.

ఇంటిని మరిపించేలా హాస్టల్



హాస్టల్‌లో ఇంటిని మరిపించేలా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. నేను ప్రభుత్వ బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. హాస్టల్‌లో ఉంటున్నా. సన్నబియ్యంతో భోజనం చాలా బాగుంది. మెనూ అమలవుతోం ది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువును కొనసాగిస్తున్నా.

-చిన్నహుస్సేన్, ఎస్సీ బాలుర హాస్టల్, కదిరి

హాస్టల్‌లో మంచి వసతులు కల్పించారు..



నేను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలో బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతున్నా. ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌లో ఉంటున్నా. ప్రభుత్వ వసతి గృహాలపై ప్రభుత్వ పర్యవేక్షణ చాల బాగుంది. మాలాంటి పేద విద్యార్థుల గురించి ఆలోచించి, మౌలిక వసతులు కల్పించడం ఆనందంగా ఉంది. అధికారులు, హాస్టల్ వార్డెన్ పర్యవేక్షణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చక్కని వాతావరణంలో ఉంటున్నాం.

-శ్రీదేవి, ఎస్సీ బాలికల కాలేజీ హాస్టల్, కదిరి

విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం



పేద విద్యార్థుల విద్యాభివృద్ధి చక్కగా కొనసాగేలా రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాల్లో మంచి వాతావరణం కల్పించింది. ఇప్పటివరకు అసౌకర్యాలతో పిల్లలు కొంత మేర ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు పూర్తి సౌకర్యాలతో చక్కగా చదువుకునే అవకాశం కలిగింది. ఈయేడాది వసతి గృహాల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశముంది. పూర్తి సౌకర్యాలకు ప్రభుత్వం తీసుకున్న చొరవ పట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- శివరంగప్రసాద్, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్

పొలాల దారి కబ్జా



కబ్జా అయిన రస్తాను చూపుతున్న రైతులు

బత్తలపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రైతులు పొలాలకు వెళ్లే రస్తాను వైసీపీ నాయకుడు కబ్జా చేసిన ఘటన మండలంలోని డి.చెర్లోపల్లిలో చోటుచేసుకుంది. డి.చెర్లోపల్లికి చెందిన వైసీపీ నాయకుడు క్రిష్ణమనాయుడు 2021లో రైతులు పొలాలకు వెళ్లే రస్తాను తన భూమిలో కలుపుకున్నాడు. దీంతో పాటు టీడీపీ నాయకుడు విజయకుమార్‌కు చెందిన కొంత భూమిని కబ్జా చేశాడు. దీనిపై అప్పట్లో అడిగిన తొమ్మిది మంది టీడీపీ నాయకులపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయించారు. బాధిత విజయకుమార్ తదితరులు ఇటీవల భూ కబ్జా విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు శనివారం టీడీపీ నాయకుడు విజయకుమార్ భూమిని వైసీపీ నాయకుడి కబ్జా నుంచి తొలగించి బాధితుడికి అప్పగించారు. ఇక రస్తా భూమి వైసీపీ నాయకుడి ఆక్రమణలోనే ఉంది. దీనిపై అధికారులు సంబంధిత వైసీపీ నాయకుడికి ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా కొలతలకు రాలేదు. అతడు అప్పట్లో తన పలుకుబడి ఉపయోగించి పట్టాదారు పాసుపుస్తకాలు సైతం తెచ్చుకున్నట్లు సమాచారం. దీంతో పలువురు రైతులు వారి పొలాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తాము వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు నెలకొన్న రస్తా సమస్యను పరిష్కరించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

క్షుద్రపూజలు చేశారని ఫిర్యాదు

నల్లమాడ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తమ ఇంటికి క్షుద్రపూజలు చేశారంటూ మండలకేంద్రంలో నివాసముంటున్న షేక్ షాకీర్ బాషా అనే వ్యక్తి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. షేక్ షాకీర్ బాషా కుటుంబసభ్యులు వారం రోజులు నుంచి తమ ఇంట్లో లేరు. అనంతపురం వద్ద మామిడి తోట తీసుకుని వ్యాపారం కోసం వెళ్లారు. శనివారం అర్ధరాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంటి ప్రహరీ తాళం పగలకొట్టి, లోపలికి వెళ్లి గడపకు క్షుద్రపూజలు చేశారని అతడు తెలిపారు. అక్కడ నిమ్మకాయలు, తాంబూలం పెట్టి, బూడితలాంటివి వేశారని అన్నాడు. దీంతో తమకు ఎటువంటి హాని జరుగుతుందో అని భయపడుతున్నట్లు షాకీర్ బాషా ఆందోళన వ్యక్తం చేశాడు. అక్కడికి వెళ్లి పరిశీలించి, విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.

శ్మశాన వాటికను తొలగించారని...

నల్లమాడ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకరకుంట గ్రామ ముస్లిం శ్మశానవాటికలోని సమాధులను శనివారం రాత్రి ఎక్స్‌కవేటర్లతో తొలగించినట్లు ఆ గ్రామ ముస్లిం నాయకులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వంకరకుంట గ్రామం వెలసినప్పటి నుంచి ముస్లింల 60 కుటుంబాలు ఉన్నాయన్నారు. గ్రామానికి సమీపంలో సర్వే నం. 149-1లో 2. 03 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందన్నారు. ఇందులో 1. 03 ఎకరాలు ముస్లిం శ్మశానవాటికకు, మరో ఎకరా బోయకులస్తుల శ్మశానవాటికకు కేటాయించారన్నారు. వాటి పక్కనే తమకు భూములు ఉన్నాయని సాంబశివారెడ్డి, శంకర్‌రెడ్డి, శివారెడ్డి, క్రిష్టారెడ్డి శనివారం రాత్రి ముస్లిం శ్మశాన వాటికలోని సమాధులను ఎక్స్‌కవేటర్‌తో చదును చేయించినట్లు తెలిపారు. తమకు న్యాయంచేయాలని కోరారు. సంఘటన స్థలానికెళ్లి, వారిని పిలిపించి పరిశీలిస్తామని పోలీసులు తెలిపారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు బొగ్గు నాగరాజు, జాయింట్ సెక్రటరీ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. స్థానిక మున్సిపల్ కార్యా లయం ఎదుట కార్మికులు ఆదివారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. లేకపోతే జూలై 4న విజయవాడలో జరిగే బహిరంగ సభలో పిలుపు ఇస్తే సమ్మెబాట పడతా మని హెచ్చ రించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్, కోశాధికారి కాటమయ్య, సెక్రటరీ బాబు, సలహాదారుడు యోగేశ్, దస్తగిరి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ముగ్గురు అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

● రూ.25 లక్షల విలువైన బంగారు నగల స్వాధీనం

నందలూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీ దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద ముగ్గురు దొంగలను పట్టుకుని వారి నుంచి 250 గ్రాముల బంగారం (వీటి విలువ సుమారు 25 లక్షలు)తో పాటు 14 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డిలకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులను చూసి పారిపోతున్న ఆవుల సంజయ్య, ఆవుల ఈశ్వరమ్మ, ఆవుల ప్రమీలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారని, వారి వద్ద నుంచి 250 గ్రాముల బంగారం, 14 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట గ్రామానికి చెందిన వారని, వీరిపైన నందలూరులో 2 కేసులు, వేంపల్లె, పులివెందుల, అనంతపురం మూడో టౌన్, ఆళ్లగడ్డ టౌన్, నంద్యాల వన్‌టౌన్‌లలో కేసులు నమోదయ్యాయని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అంతర్ జిల్లాల దొంగలను చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

విద్యారంగ సమస్యల సాధనకు కృషి: ఎస్టీయూ

కదిరి అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార సాధనకు ఎస్టీయూ కృషిచేస్తోందని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం కదిరి డివిజన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యలో నాణ్యత పెంచడం, విద్యను మరింత అందుబాటులోకి తేవడం, ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ తదితర విషయాలపై చర్చించారు. డివిజన్ పరిధిలో సభ్యత్వ నమోదు విజయవంతం చేసేలా సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రామమోహన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జవహర్, సభ్యులు జాఫర్, ఎన్‌వీ ప్రసాద్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో అదనపు సౌకర్యాలు

పుట్టపర్తి టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రమైన పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఆదివారం అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల కోసం నిరీక్షణ స్థలంలో అదనంగా కుర్చీలు ఏర్పాటు చేశారు. అలాగే ఫ్యాన్లు, బస్సుల రాకపోకలు తెలిపే నూతన బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రయాణికుల కోసం మరిన్ని సౌకర్యలను త్వరలో కల్పిస్తామని డిపో మేనేజర్ ఇనయతుల్లా తెలిపారు.

సమరశీల పోరాటాలకు సిద్ధంకండి

● సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న వేమయ్యయాదవ్

తనకల్లు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సమర శీల పోరాటాలకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పేర్కొన్నారు. సీపీఐ శతవసంతాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలకేంద్రంలో రెండో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ప్రాంతంలో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో మతతత్వా రాజకీయాలు ఊపందుకున్నాయని పే ర్కొన్నారు. అయితే పేదవారి సమస్యలు అలాగే ఉన్నాయని, ఉపాధి మార్గాలు కనుమరుగు అయ్యాయని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మునుపు ఇచ్చిన హామీలు ఏమైనట్లు అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల అమలు విష యంలో మొండిచేయి మిగిలిందన్నారు. గ్రామాల్లో మూడుసెంట్లు, పట్టణాల్లో రెండుసెంట్లు కేటయిస్తామన్న ప్రభుత్వ హామీ ఏమైందన్నారు. మండలంలో నిరుపేదలు ఇళ్లు నిర్మించుకునేలా సీపీఐ పోరాటాలు చేస్తుందన్నారు. వాటిని నిర్వీర్యం చేయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. బొంతపల్లి రెవెన్యూ భూముల్లో వంద ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయిందన్నారు. అయితే రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రెడ్డెప్ప, రైతు సంఘం నాయకులు చౌడప్పయాదవ్, ఇక్బాల్, మధు నాయక్, ఈశ్వరయ్య, శ్రీరాములనాయుడు, చంద్ర, సుగుణమ్మ, అనసూయమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

వేద విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లతో వేద విద్యార్థులు

కదిరి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ క్షేత్ర బ్రాహ్మణ సమైఖ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వేద విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని దత్త ఫంక్షన్ హాలులో మూడు రోజులుగా ఆ సంఘం ఆధ్వర్యంలో జనార్దనానంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్టు(హైదరాబాద్) వేద విద్వన్మహాసభలు నిర్వహిస్తున్నారు. మూడో రోజు గోపూజతో సభలు ప్రారంభమయ్యాయి. వేద విద్యార్థులకు పరీక్షలు, వేద పారాయణం నిర్వహించారు. సంస్కృతి ట్రస్టు ఛైర్మన్ తుములూరి సాయినాథ శర్మ అధ్యక్షతన నిర్వహించిన సభలో వేద విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. వేద పండితులను ఘనంగా సత్కరించారు. అనంతరం బ్రహ్మశ్రీ డాక్టర్ ముద్దుపల్లి దత్త్రాయ్య శాస్త్రి, డాక్టర్ ముష్టి పవన్‌కుమార్ ధార్మిక ప్రవచనాలు ఇచ్చారు. కార్యక్రమంలో టీటీడీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి దువ్వూరి ఫణి యజ్ఞేశ్వర యాజులు, ఆర్డీఓ వీవీఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం

ధర్మవరం రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్యవైశ్య సత్రంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం(ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వంశీకృష్ణ నోబల్‌స్కూల్ కరస్పాండెంట్ బీరే వంశీకృష్ణ, ఆర్ఎస్ఎస్ విభాగ కార్యకారిణి సభ్యులు కత్తి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కత్తి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు కాబో తోందన్నారు. సామాజిక సమరసత, కుటుంబప్రబోధన్, పర్యావరణ పరిరక్షణ, పౌరవిధులు, స్వదేశీ స్వావలంబన వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగ బౌద్దిక్ ప్రముఖ్ శింగనమల శివశంకర్, వివేకానంద జిల్లా కార్యవాహ్ సీకే శరత్, ఉపాధ్యాయ ప్రముఖ్ అన్నంఅరవింద్, పి.నరసింహ, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

ధర్మవరం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కౌన్సిల్ సమావేశాన్ని సోమవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశపు భవనంలో నిర్వహించే ఈ సమావేశా నికి కౌన్సిలర్‌లు, కో ఆప్షన్‌మెంబర్లు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తనకల్లులో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

తనకల్లు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1975-76 సంవత్సరంలో పదో తరగతి చదివిన నాటి విద్యార్థులు 50 సంవత్సరాల తరువాత ఆదివారం అదే పాఠశాలలలో కలుసుకున్నారు. 65యేళ్ల వయస్సున్న ఒకరినొకరు గుర్తు పట్టుకుంటూ, ఆత్మీయంగా పలకరించుకుంటూ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎంతో ఉత్సాహంగా సాయంత్రం వరకు గడిపారు. నాటి ఉపాధ్యాయులు కుళ్లాయిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మరో ఉపాధ్యాయురాలిని దుశ్శాలువాలు, పూలమాలలు, మెమెంటోలతో సన్మానించారు. అప్పటి 54 మంది విద్యార్థుల్లో 42మంది కలిసినట్లు తెలిపారు. 50 యేళ్ల తరువాత నాటి విద్యార్థులు కలిశారనే విషయం తెలుసుకుని పలువురు గ్రామస్థులు పాఠశాల వద్దకు వెళ్లి వారిని పలుకరించారు.



ధర్మవరంలో...

● ధర్మవరం(ఆంధ్రజ్యోతి): కన్నతల్లిని.... చదువుకున్న బడిని ఎన్నటికీ మరువరాదని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.. ధర్మవరంలోని కొత్త పేట బాలుర ఉన్నత పాఠశాలలో 1997-2002 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక చోట కలిశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కలిసిమెలసి ఆనందంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కంప్యూటర్, బ్లూటూత్ స్పీకర్, మైకు అందించారు. భవిష్యత్తులో తమవంతు సహాయసహకారాలు అందిస్తామని పూర్వవిద్యార్థులు తెలియజేశారు.




పుట్టపర్తి సాయి ఆరామంలో...

● పుట్టపర్తి రూరల్(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీమతి ఈశ్వరమ్మ పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చది విన పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక సాయి ఆరామంలో ఈ కార్యక్రమం సందడిగా సాగింది. ప్రస్తుతం ఎక్కెడెక్కడో వివిధ స్థానాల్లో స్థిరపడ్డ సుమారు 70 మంది పూర్వవిద్యార్థులు దాదాపు 25 సంవత్సరాల తర్వాత కలుసుకుని బాల్యస్మృతులను గుర్తుచేసుకున్నారు.

న్యూస్ బాక్స్

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే సుప్రభాతసేవ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు. సిద్ధేశ్వర స్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరూపాక్షేశ్వరస్వామిలకు ప్రత్యేకంగా వెండికవచం తొడిగి పూలతో అలంకరించారు. కార్యక్రమంలో అర్చకులు సిద్ధలింగేశ్వరస్వామి, శివకుమారస్వామి, రవిశంకర్ స్వామి, మహేష్, కుమారస్వామి, ప్రదీప్‌గౌతం పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

స్వామిని దర్శించుకున్న జిల్లా న్యాయాధికారి

అమరాపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామిని ఉమ్మడి జిల్లా న్యాయాధికారి సత్యవాణి, అడిషనల్ సివిల్ న్యాయాధికారి ఆర్ అశోక్‌కుమార్, మడకశిర కోర్టు సూపరింటెండెంట్ మురళీక్రిష్ణ దర్శించుకున్నారు. ఆలయ కమిటీవారు ప్రత్యేక పూజలు జరిపించి తీర్థప్రసాదాన్ని అందించారు. ఆలయం విశిష్టతను వివరించారు. వీరి వెంట ఎస్‌ఐ ఇసాక్‌బాషా, హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్, గంగాధర్, ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ అడ్వకేట్ కృష్ణమూర్తి, స్థానికులు ఉన్నారు.

జాతీయస్థాయి సమావేశాలకు
'పురం' మున్సిపల్ చైర్మన్



చైర్మన్ రమేష్

హిందూపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హర్యాణా రాష్ట్రంలోని గురుగ్రాంలో 3, 4 తేదీల్లో జరిగే జాతీయస్థాయి సమావేశంలో తాను హాజరుకానున్నట్లు మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ తెలిపారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర అనే అంశంపై రెండ్రోజులపాటు సమావేశాలు జరగనున్నాయి. సమావేశాలు దేశ పార్లమెంట్, హర్యాణా ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రపాలిత పట్టణ స్థానిక సంస్థల చైర్మన్లకు ఆహ్వానించినట్లు తెలిపారు. ఇందులో తనను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇటీవల తిరుపతిలో జరిగిన ఆర్థిక సంఘం సమావేశానికి రాయలసీమ నుంచి చైర్మన్ ఒక్కడే హాజరయ్యారు. జాతీయస్థాయి సమావేశాల్లో కూడా ఎంపిక చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం



జెండా వందనానికి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అమరాపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్నడుగు గ్రామంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని జూలై 7న ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. మాదిగలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పలక ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడు నరసింహులు, తాలూకా అధ్యక్షుడు గంగాధర్, మండల అధ్యక్షుడు శివకుమార్, మంజునాథ్, రాజేష్, చెన్నప్ప కోరారు.

ఆర్థికసాయం

హిందూపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం కొడిగెనహళ్లికి చెందిన నయీం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆల్ ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ.25,500 ఆర్థికసాయం అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షులు అమాన్ మాట్లాడుతూ నయీం తండ్రి మహబూబ్‌బాషా కార్పెంటర్ అయితే కుమారుడి వైద్యం ఖర్చు అధికం కావడంతో విషయం తెలుసుకుని మరికొంతమంది సహకారంతో ఈ మొత్తాన్ని అందించినట్లు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు ఫరూక్, అర్బాన్, ఉస్మాన్, సాదిక్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలు
● పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు



ట్రాన్స్‌ఫార్మర్, స్తంభానికి ఎగబాకిన పచ్చని తీగలు

రొద్దం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): దొడగట్ట గ్రామంలో రోడ్డుపక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పచ్చని తీగలు ప్రమాదకరంగా మారాయి. గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణం రోడ్డుపక్కనే ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం పైభాగంవరకు తీగలు పెరిగినా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వర్షాకాలంలో షార్ట్‌సర్క్యూట్ అయితే కిందనే ఉన్న కంపచెట్లతో మొత్తం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయే ప్రమాదం ఉంది. పచ్చని తీగలు తొలగించి ప్రమాదం జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా కంపచెట్లు



రెడ్డిపల్లి చెరువుకట్టపై రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

రొద్దం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): చెరువుకట్టపై రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రెడ్డిపల్లి చెరువుకట్టపై సింగిల్ రోడ్డు కావడం, ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోవడంతో ముందు వచ్చే వాహనాలు పక్కకు వెళ్లడానికి వీలులేకుండా పోతోంది. దీనికితోడు మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పంచాయతీ అధికారులు స్థానిక సర్పంచ్, రెడ్డిపల్లి చెరువుకట్టపై ఉన్న కంపచెట్లను తొలగించాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వ్యసనాలకు బానిసవుతున్న యువత..!

● మండలంలో పెరిగిన అసాంఘిక కార్యకలాపాలు
● నియంత్రించలేని పోలీసులు
● కౌన్సెలింగ్ ఇస్తున్నా పట్టించుకోని వ్యసనపరులు



సోమందేపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలిసీ తెలియని వయసులో చెడువ్యసనాలకు బానిసై యువత పెడదోవ పడుతోంది. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునే భావిభారత పౌరులుగా ఎదగాల్సిన యువత కౌమారదశలోనే అసాంఘిక కార్యకలాపాలవైపు మొగ్గుచూపుతూ అందమైన జీవితాన్ని అంధకారం చేసుకుంటోంది. ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల కలలను నాశనం చేస్తూ వారిని క్షోభకు గురిచేస్తున్నారు. సోమందేపల్లి మండలంలో ఆన్‌లైన్ మట్కా, గంజాయి, ఆన్‌లైన్ గేమ్స్, జూదం, మట్కా తదితర చెడు వ్యసనాల బారినపడుతున్న యువతను ప్రభుత్వ వ్యవస్థలు, తల్లిదండ్రులు నియంత్రించలేకపోతున్నారు. మత్తులో వారేం చేస్తున్నారో తెలియక అల్లర్లు, గొడవలకు దిగుతూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతూ తలనొప్పిగా మారుతున్నారు.

కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

గత యేడాది పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి పోలీసులు బృందంగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. అనుమానితులుగా ఉన్న యువతకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. సాయినగర్, శివానగర్, మారుతినగర్, నక్కలగుట్ట కాలనీల్లో పలువురు యువకులు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆయా ప్రాంతాలకు వెళ్లి తల్లిదండ్రులు, యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు. ఇటీవల మార్కెట్‌రోడ్డులో నాటిక ప్రదర్శన ఇస్తున్న ప్రదేశంలో మత్తులో కత్తులతో ఒకరిపై ఒకరు దాడిచేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. గీతానగర్‌లో మద్యం మత్తులో ఓ ఉద్యోగితో గొడవపడి అతన్ని, కుటుంబ సభ్యులపై దాడిచేసి గాయపరిచిన సంఘటన సంచలనంగా మారింది. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్న యువకులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిపంపారు. అమ్మాయిలపై వేధిస్తున్నవారిని, ప్రేమపేరుతో వంచించేవారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. సాయినగర్‌లో ఆకతాయిలు గంజాయి సేవించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మహిళలు ఫిర్యాదు చేశారు. ఇలాంటివెన్నో సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మారుతినగర్‌లో యువకుడు ఆన్‌లైన్ గేమ్స్‌లో అప్పులు పెరిగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. వినాయకనగర్‌లో హిందూపురానికి చెందిన మట్కా నిర్వాహకుడు ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం. సోమందేపల్లిలో చేనేతలు అధికంగా ఉన్నారు. అసాంఘిక శక్తులు వారిని చెడుమార్గాలపై ఆకర్షిస్తూ మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి తదితర దుర్వ్యసనాలవైపు వెళుతున్నారు. వాటిని నియంత్రించడానికి పోలీసులు విశ్వప్రయత్నాలు చేస్తున్నా యువతలో మార్పురావడంలేదు. కేసునమోదుచేస్తే వారి జీవితాలు నాశనం అవుతాయని కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మండలంలో మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల ముఠాను పూర్తిస్థాయిలో అరికట్టకపోతే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం
- రమేష్, ఎస్ఐ, సోమందేపల్లి



అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం. మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని రూపు మాపేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. అసాంఘిక శక్తులపై ప్రజలు సమాచారం అందిస్తే అలాంటి వారిని ఉపేక్షించేది లేదు.

దళారులను నమ్మి మోసపోకండి
● ప్రొఫెసర్ త్రిలోచన శాస్త్రి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ త్రిలోచనశాస్త్రి

పెనుకొండ రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ప్రొఫెసర్ త్రిలోచనశాస్త్రి అన్నారు. ఆదివారం మండలంలోని గుట్టూరు వేరుశనగ మిల్లులో 15వ వార్షిక మహాసభ నిర్వహించారు. రైతు పరస్పర సహాయ సహకార పరపతి సమాఖ్య (సీసీడీ)ను నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో త్రిలోచనశాస్త్రి మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే సీసీడీ లక్ష్యమన్నారు. 2010లో ఉమ్మడిజిల్లాలో రూ.64లక్షల పెట్టుబడితో 540మంది రైతు సంఘాలను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం ఉమ్మడిజిల్లాలో 35మండలాల్లో 31,424 మంది రైతులు 318రైతు సహకార సంఘాలుగా ఏర్పడి ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయడం హర్షణీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత ముందుకు వెళ్లి బలోపేతం కావాలన్నారు. కార్యక్రమానికి ఎస్‌డీకే ట్రస్ట్ చైర్మన్ గణేష్, సమాఖ్య సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్తల పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీపీయూనిట్ వైద్యాధికారి డాక్టర్ కేసీకే నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీపురం పీహెచ్‌సీ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, శ్రీనివాసనగర్ పీహెచ్‌సీ పరిధిలోని 32వ వార్డు అహ్మద్‌నగర్, ఇందిరానగర్ పీహెచ్‌సీ పరిధిలో 14వ వార్డు సూగూరు సచివాలయ పరిధిలో మూడు ఖాళీలున్నాయన్నారు. వీటికి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సోమవారం నుంచి వచ్చేనెల 4వరకు సంబంధిత పీహెచ్‌సీలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10వ తరగతి పాసై వివాహితులై ఉండాలన్నారు. ఖాళీగా ఉన్న చోటే నివాసం ఉండాలి, 25-40సంవత్సరాల వయసు ఉండాలన్నారు. వితంతువులు, విడాకులు పొందిన, భర్త నుంచి విడిపోయిన వారు నిరాశ్రయులైనవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. నివాస ధ్రువీకరణ పత్రం రేషన్‌కార్డు, ఓటరు, ఆధార్, బ్యాంక్ పాసుపుస్తకం, టెన్త్ సర్టిఫికెట్, అందజేయాలన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగంపల్లి తండాకు చెందిన జానకీబాయి అనే మహిళ విషద్రావకం తాగి ఆదివారం ఆత్మహత్యకు యత్నించారు. రాజునాయక్, జానకీ దంపతుల మధ్య వివాదం తలెత్తడంతో భర్త మందలించడానికి తీవ్ర మనస్థాపానికి గురై విషద్రావకం తాగి అస్వస్థతకు గురైంది. ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ వినోద్‌కుమర్ చికిత్సలు చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

హిందూపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తూమకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం నాయకులు రవికుమార్, సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం తూమకుంట చెక్‌పోస్టులో ఆదివారం సమ్మె కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ లేబర్-4 కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. 12గంటల పనిసమయాన్ని 8గంటలకు తగ్గించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల విచక్షణ కోల్పోయి నష్టం చేకూర్చే నిబంధనలు తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘం నాయకులు హరీష్‌రెడ్డి, చిన్నప్పయ్య, హనుమంతరాయుడు పాల్గొన్నారు.

షిర్డీసాయి భక్తుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న షిర్డీసాయి భక్తులు

గోరంట్ల, జూన్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూడిదగడ్డపల్లి షిర్డీసాయిబాబా ఆలయ సేవా సమితి గురుపౌర్ణమి వేడుకలకోసం భక్తులు భిక్షాటన చేశారు. జూలై 10న గురుపౌర్ణమి సందర్భంగా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు బాబా రథంతో గ్రామాలు తిరుగుతూ ప్రజలనుంచి ధనం, ధాన్యం, వస్తువులు సేకరిస్తున్నారు. పట్టణంలోని వీధుల్లో నారాయణానంద స్వామి ఆధ్వర్యంలో భక్తులు ఇంటింటికెళ్లి జోలెపట్టి భిక్షాటన చేశారు. షిర్డిసాయిబాబా సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ సంయుక్త కార్యదర్శిగా శ్రావణ్‌కుమార్

గోరంట్ల, జూన్29 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన శ్రావణ్‌కుమార్ నేషనల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ సత్యసాయి జిల్లా సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ సంపత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని చింతమానుపల్లివద్ద ఆదివారం అనాథాశ్రమంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. పేద ప్రజలు, బహుజనుల సంక్షేమం, ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషిచేస్తానని శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

● యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నేతలు

పెనుకొండ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతం బాధ్యత ప్రభుత్వానిదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ అన్నారు. స్థానిక మౌర్య రెసిడెన్స్‌లో యూటీఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం జీఓ19, 21, 22 ద్వారా తొమ్మిదిరకాల పాఠశాలలు ఏర్పాటు చేసిందన్నారు. 9652మోడల్ పాఠశాలలు, 10వ తరగతి ఉన్నత పాఠశాల 11,552 ప్రాథమికోన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి 779 ఉన్నత పాఠశాలలుగా ఫౌండేషన్ పాఠశాలలో 5వేలు, ప్రాథమిక పాఠశాలలో 19వేలు ఏర్పాటు చేశారన్నారు. ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే ప్రమాదం ఉందన్నారు. వీటిని బలమైన పాఠశాలలుగా మార్చుకునేందుకు అవకాశం ఎంతైనా ఉందన్నారు. దీనిద్వారా ప్రభుత్వ విద్యారంగం సాధ్యపడుతుందన్నారు. ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని పీఆర్‌సీ కమిషన్ నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బూతన్న, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తాహీర్‌వలి, లక్ష్మీనారాయణ, శివశంకర్, నారాయణస్వామి, నరేష్‌కుమార్, క్రిష్టప్ప, నరసింహప్ప, మహంతేశ్వర్ పాల్గొన్నారు.

రెండెకరాల్లోనే పత్తి పంట సాగుచేయాలి

● ప్రైవేటు ఏజెన్సీ నిర్వాహకుల హుకుం
● పంటను తొలగిస్తున్న రైతులు

అమరాపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలో 5వేల ఎకరాల్లో రైతులు పత్తిపంటను సాగుచేస్తున్నారు. 2023-24 సంవత్సరంలో పత్తి విత్తనాల ధర క్వింటాల్ రూ.38వేలు ఉండగా ఒక్కసారిగా రూ.50వేలుకు పెంచేశారు. 2024-25సంవత్సరంలో పత్తివిత్తనాలు క్వింటాల్ రూ.50వేలకు తీసుకున్నారు. ప్రస్తుతం పత్తి విత్తనాల ఆర్గనైజర్ రాశి ఏజెన్సీవారు గోవిందరాజు, జావగానహళ్లి గ్రామానికి చెందిన సురేష్ పత్తిపంటను వేసుకున్న ప్రతి రైతు ఎకరాకు రెండు క్వింటాళ్లు మాత్రమే పండించాలని హుకుం జారీ చేశారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలం కొర్రేవు గ్రామానికి చెందిన శివన్న వేసుకన్న మూడెకరాల పత్తిపంటను ఉన్నఫళంగా తొలగించారు. ఇదే గ్రామానికి చెందిన దేవరాజు కూడా రెండెకరాల్లో పత్తి పంటను తొలగించారు. పేలుబండ గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప నాలుగు ఎకరాల్లో సాగుచేస్తుండగా రెండెకరాల్లో తొలగించారు. రాశి కంపెనీ ఆర్గనైజర్ గోవిందప్ప జావగానహళ్లి గ్రామానికి చెందిన సురేష్ అనే ఆర్గనైజర్ రైతులకు గట్టిగా చెప్పడంతో వేసిన పత్తి పంటను తొలగించారు. ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఉన్నతాధికారులు స్పందించి పత్తి పంట సాగుచేస్తున్న రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.



కొర్రేవు గ్రామం వద్ద తొలగించడానికి సిద్ధంగా ఉన్న పత్తిపంట



వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

టీడీపీలోకి పలువురి చేరిక

మడకశిర టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైసీపీ నాయకులు ఆదివారం బాలాజీ నగర్ టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి సమక్షంలో ఆపార్టీని వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మెళవాయి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రంగస్వామి, పవన్, గంగరాజు, కె. తిమ్మయ్య, రంగనాథ్‌తో పాటు 10 కుటుంబలు తెలుగుదేశం పార్టీలలోకి చేరారు. అందరికీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ చంద్రబాబు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యాక్రమాలు చూసి రోజు రోజుకు పార్టీలో చేరేవారి సంఖ్య పెరుగుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధి ఒక్క చంద్రబాబు వల్లే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. అనంతరం టీడీపీ నాయకులతో సమావేశమై పార్టీ అభివృద్ధికి సంబంధించి పలువిషయాలు చర్చించారు. మాజీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, రంగనాథ్, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు 'పురం' విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులతో పెన్‌కాక్‌సిలాట్ మాస్టర్లు

హిందూపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల నంద్యాలలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 13వ రాష్ట్రస్థాయి పెన్‌కాక్‌సిలాట్ పోటీల్లో పాల్గొన్న హిందూపురం విద్యార్థులు సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి మనోజ్‌సాయి తెలిపారు. రాష్ట్రంలోని గుంటూరు, పల్నాడు, కర్నూలు, నంద్యాల, సత్యసాయి జిల్లాల నుంచి పాల్గొంటారన్నారు. ఇందులో హిందూపురానికి చెందిన బాలికల టాండింగ్ సీనియర్ విభాగంలో షేక్ నస్రీన్, జూనియర్ విభాగంలో మదిహ, ప్రణవి, మానస, ప్రీజూనియర్ విభాగంలో దివ్య, టీన్ విభాగంలో తన్విత‌రెడ్డి, ముఖాన్, మధుర, మీన, హఫీస, కౌసర్ ఎంపికయ్యారు. బాలుర జూనియర్ విభాగంలో దరుణ్, ఆదిత్య, ప్రీ టీన్ విభాగంలో దుర్గా స్మరణ్, ఈశ్వర్ పథకాలను గెలుచుకున్నారు. వీరిని రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, కోశాధికారి జనార్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రఫీక్‌అహ్మద్, రియాజ్ అభినందించారు. వీరు జూలై 18-20వరకు తిరిచిలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొనున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పరిగి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అప్పట్లో చదివిన తరగతుల్లో కలియతిరిగి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారు కూర్చున్న ప్రాంతాలు, ఆడిన ఆటలు గుర్తుచేసుకుని ఒకరికొకరు అనంతరం విందు భోజనాలను ఆరగించారు. విద్యనేర్పిన అప్పటి గురువులను సన్మానించారు.